క్లుప్తంగా

వరద నీరు రాకుండా చర్యలు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): కృష్ణానదికి భారీ వరద నేపథ్యంలో మండలంలోని ఉత్తర చిరువోలులంక కృష్ణానది అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గ్రామంలోకి వరద నీరు చొచ్చుకురాకుండా ఇసుక మూటలను అడ్డుగా వేశారు. బుధవారం రాత్రి అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా పొలాల్లోకి నీరు చేరడంతో ఆందోళన చెందిన స్థానికులు ఇసుక మూటలు వేశారు. సాగు నీటి సంఘం అధ్యక్షుడు భోగిరెడ్డి సాంబశివరావు, సభ్యులు బడే రామాంజనేయులు, ఆర్‌సీ ఏఈఈ హరీష్, లస్కర్ వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ



కె.కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెం జెడ్పీ పాఠశాల క్రీడాకారులకు పలు క్రీడా పరికరాలను స్థానిక పీఏసీఎస్ చైర్ పర్సన్ పూషడపు రత్నగోపాల్ గురువారం అందజేశారు. సాఫ్ట్ బాల్ గ్లోవ్స్, సాఫ్ట్ బాల్స్, జావలిన్, షార్ట్‌పుట్ బాల్, డిస్క్‌లు పాఠశాల హెచ్‌ఎం గండు కృష్ణప్రసాద్‌కు అందించారు. జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు మత్తి వంశీ, నీటి సంఘం అధ్యక్షుడు మత్తి నాగమల్లేశ్వరరావు, గరికిపాటి మారుతి, శివ కోటయ్య, మండలి రమణ, టీచర్లు పాల్గొన్నారు.

మోపిదేవి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు బాధ్యతల స్వీకరణ



మోపిదేవి: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులు గురువారం పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ చైర్‌పర్సన్‌గా పరుచూరి శ్రీనివాసరావు, పర్సన్లుగా కారుమూరి ప్రసాద్, కొలుసు శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో అధికారుల సమన్వయంతో ఎరువుల కొరత రాకుండా ప్రయత్నిస్తానన్నారు. రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ సంబరం



ఘంటసాల: ఘంటసాల అంబేడ్కర్ నగర్‌లో శ్రీ కోట ముత్యాలమ్మ సంబరం గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లబండిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటంతో ప్రత్యేకంగా అలంకరించిన ప్రభను ఏర్పాటు చేసి డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం చేపట్టారు. అంబేడ్కర్ నగర్ నుంచి ప్రధాన సెంటర్ మీదగా బ్యాంకు సెంటర్‌కు వెళ్లి అక్కడ నుంచి శ్రీ కోట ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లారు. డీజే, డప్పు వాయిద్యాలు, ప్రత్యేక పాటలతో మహిళలు, యువకులు, గ్రామస్తులు ఉత్సాహంగా సంబరంలో పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి



బంటుమిల్లి: గణేష్ ఉత్సవ కమిటీలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ గణేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రుల సందర్భంగా ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. పందిళ్ల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. డీజే సౌండ్ సిస్టంకు అనుమతులు లేవని డీఎస్పీ వద్ద ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహించేది మైకు అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ పేర్కొన్నారు. కృత్తివెన్ను మండలానికి ఇవే నిబంధనలు వర్తిస్తాయని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ గణేష్‌కుమార్ హెచ్చరించారు.

అన్నదాత సుఖీభవకు 134 అర్జీలు

గూడూరు: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి గూడూరు మండలంలో 134 అర్జీలు వచ్చినట్లు ఏవో జి.శివరామకృష్ణ తెలిపారు. పథకానికి అర్హులై ఉండి రైతుల ఖాతాలో నగదు జమ కాని వారు అర్జీ పెట్టుకోవడానికి ప్రభుత్వం ఈనెల 20 వరకు గడువు ఇచ్చిందన్నారు. బుధవారం సాయంత్రంతో గడువు ముగియగా గూడూరు మండలానికి 134 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయన్నారు. వీటిపై విచారణ పూర్తి చేసి నిధులు జమ చేస్తామని ఆయన చెప్పారు.

భారతీయ సంస్కృతి ఆదర్శనీయం

బంటుమిల్లి: భారతదేశ సంస్కృతి, వైభవం ఆదర్శనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్ మోహన్‌రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో భారతీయ సాంస్కృతిక వైభవంపై కృష్ణాజిల్లా కోఆర్డినేటర్ శ్రీనాథ్ గురువారం ప్రసంగించారు. దేశం విడిపోక ముందు దేశ చరిత్ర, నాగరికత ఎలా విలసిల్లిందో విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశం విడిపోయిన తర్వాత మన సంస్కృతి ఎంత నష్టపోయిందో వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.దేవజయరాజు, కో ఆర్డినేటర్ హిమాలి నిదేవీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆనంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులతో చెలగాటం !

- నియోజకవర్గంలో వందల సంఖ్యలో దివ్యాంగుల పింఛన్లు తొలగింపు
- ఎంపీడీవో కార్యాలయాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- పునఃసమీక్షకు తొలగింపు నోటీసుల వెరిఫికేషన్ అంటూ మళ్లీ అప్‌లోడ్



నాగాయలంకలో దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్న సిబ్బంది



కోడూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద దివ్యాంగుల పడిగాపులు

నాగాయలంక/కోడూరు: కనికరం లేని కాఠిన్యమంటూ మండలంలో దివ్యాంగులు లబోదిబో మంటూ ఆందోళన చెందుతున్నారు. మండలంలో పింఛన్ తొలగింపు నోటీసులు అందుకున్న దివ్యాంగులు నాగాయలంక, కోడూరులోని మండల పరిషత్ కార్యాలయాల బాట పట్టారు. తీవ్ర ఆందోళనతో, ఆవేదనతో దివ్యాంగులు గురువారం పెద్ద సంఖ్యలో కార్యాలయాలకు చేరుకున్నారు. అధికారులు సూచనల మేరకు పునఃసమీక్ష అప్‌లోడ్ కోసం లబ్ధిదారులు తమ వివరాలతో కొత్త దరఖాస్తులు అందజేస్తూ కార్యాలయాల్లో బారులు తీరారు. నాగాయలంక మండలంలో దివ్యాంగుల పింఛన్లు 1169 ఉండగా వాటిల్లో ఆగస్టు 19 నాటికి 329 పింఛన్లు రద్దు చేశారు. కాగా రూ.15 వేలు పొందుతున్న ఏడుగురు లబ్ధిదారుల ఫించన్‌ను రూ.6 వేలకు కుదించారు. 54 మంది పింఛన్‌లను వృద్ధాప్య పింఛన్ల) కిందకు మార్పు చేశారు. దీంతో వీరంతా తమకు అన్యాయం జరిగిందంటూ కార్యాలయానికి చేరుకోవడంతో గందరగోళం నెలకొంది.

కన్నీటిపర్యంతమైన లబ్ధిదారులు

తొలగింపుల్లో 1997నుంచి వస్తున్న ఫించన్‌దారులు, పుట్టుకతో పోలియో బారిన పడి సుదీర్ఘ కాలంగా ఫించన్ పొందుతున్న వారు సైతం ఉన్నారు. తొలగింపు పింఛన్ దారులు ఎదురుమొండిలో అధికంగా 55 మంది ఉండగా, 37 మంది తొలగింపుతో ఎమ్మెల్యే స్వగ్రామం భావదేవరపల్లి ఉంది. 8 ఫించన్‌లు పోయి స్వల్ప స్థానంలో నంగేగడ్డ గ్రామం ఉంది. పర్రచివర శివారు బిల్లీగ్రాహంనగర్ దళితవాడకు చెందిన చిక్కాల వేణుకుమారి ఒంటి కాలితో వీల్ చైర్‌పై ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి దండాలు పెడుతూ తనకు వచ్చే రూ.15 వేలను రూ.6 వేలకు కదించారని కళ్లనీళ్లు పెట్టుకుని ఆవేదన చెందింది. ఇలా ఏ లబ్ధిదారుని కదిపినా ఫించన్ కోల్పొయామనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలగించిన తమ పింఛన్లు తిరిగి వస్తాయో మనని కోటి ఆశలతో ఎవరికివారు కాగితాలు చేతపట్టుకుని కార్యాలయంలో తిరుగుతున్నారు. ఎంపీడీవో కార్యాలయాలు ఉదయం నుంచే లబ్ధిదారులతో కిటకిటలాడాయి.

అనర్హత పేరుతో పింఛన్ల తొలగింపు

కూటమి ప్రభుత్వం అనర్హత పేరుతో దివ్యాంగుల పెన్షన్లను పెద్దమొత్తంలో తొలగించింది. అర్హత ఉన్నా కూడా సదరం సర్టిఫికెట్లలో అంగవైకల్యం తక్కువగా ఉందనే సాకు చూపి రూ.15వేలు, రూ.6వేల పెన్షన్లను భారీగా కోత విధించింది. పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్నవారి పెన్షన్లు అనర్హత పేరుతో తొలగించారని పలువురు దివ్యాంగులు అధికారుల వద్ద వాపోయారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు సైతం ప్రత్యేక ఆటోల్లో కార్యాలయానికి వచ్చి తమ అర్జీలను మండల పరిషత్ అధికారులకు అందించారు.

కన్ను తీసి సిబ్బంది చేతిలో పెట్టిన దివ్యాంగురాలు..

ఒంటి కన్ను ఉన్నవారి పింఛన్లను సైతం ప్రభుత్వం రద్దు చేసింది. అయితే మంగళవారం కోడూరు–1 సచివాలయం వద్ద ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. పింఛన్ రద్దయిన ఓ దివ్యాంగురాలు సచివాలయం వద్దకు వచ్చి తనకు ఒక కన్ను లేకపోయిన పింఛన్ రద్దు చేశారంటూ సిబ్బంది వద్ద వాపోయింది. 'కావాలంటే మీరే చూడండి మేడం.. నాకు ఉన్నది ఒక కన్ను మాత్రమే.. రెండవ కన్ను పెట్టుడిది' అంటూ తన పెట్టుడి కన్ను తీసి సచివాలయ సిబ్బంది వద్ద పెట్టినట్లు సమాచారం. సదరు సచివాలయ ఉద్యోగి ఈ ఘటనతో భయభ్రాంతులకు గురై, విషయాన్ని మండలాధికారులకు చెప్పినట్లు తెలిసింది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగురాలి పేరు తోట వెంకటేశ్వరమ్మ. కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామం. అంగవైకల్యం, పక్షవాతంలో రెండు కాళ్లు చచ్చుపడిపోయి మంచానికి లేదా చక్రాల కుర్చీకే పరిమితమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వెంకటేశ్వరమ్మ సదరం క్యాంపునకు వెళ్లగా, అక్కడ వైద్యులు ఆమెకు వైద్య పరీక్షలు చేసి 90 శాతం అంగవైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్‌ను అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అదే పెన్షన్‌ను కొనసాగిస్తూ ఇప్పటి వరకు రూ.15 వేల నగదును ప్రతి నెల అందించారు. గతం కంటే ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. అయితే ఇటీవల వైద్యులు వెంకటేశ్వరమ్మను ఇంటి వద్ద పరిశీలించి ఆమె అంగవైకల్యాన్ని 85 శాతం తగ్గించి పెన్షన్ నగదులో కోత విధించారు. 85 శాతం పైగా ఉంటేనే రూ.15 వేలు పెన్షన్ వస్తుందని, దీంతో పెన్షన్‌ను రూ.6 వేలకు మార్చినట్లు ఆమెకు సచివాలయ సిబ్బంది నోటీసులు ఇచ్చారు. వెంకటేశ్వరమ్మ నడవలేని స్థితిలో ఉన్నా కూడా తన అర్జీని అధికారులకు అందించేందుకు బుధవారం ప్రత్యేక ఆటోలో కోడూరు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చింది.

పుట్టుకతోనే పోలియో..



నేను పుట్టుకతోనే పోలియో వ్యాధిగ్రస్తుడిని. నాకు 1997 నుంచి పింఛన్ వస్తుంది. ఇప్పుడు నోటీస్ ఇచ్చారు. ఇంతటి అన్యాయపు విధానాలు ఎప్పుడూ చూడలేదు. ఎందుకు తొలగిస్తున్నారో కనీసం చెప్పకుండా నిర్లక్ష్యంగా రూ.6 వేల పింఛన్ మొత్తం రద్దు చేశామన్నారు. మూడు రోజుల క్రితం నోటీసు ఇవ్వడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది.

– భోగాది రామమూర్తి,
లబ్ధిదారుడు భావదేవరపల్లి

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ధర్మేంద్ర



కోనేరుసెంటర్: మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా కోసూరి ధర్మేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ గంగాధరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ధర్మేంద్ర గతంలో కృష్ణా జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం విజయవాడ ట్రాన్స్‌కో డీఎస్పీగా పనిచేశారు. అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ధర్మేంద్రను మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

35 మందికి పళ్ల సెట్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కృష్ణాజిల్లా శాఖ సంయుక్తంగా స్థానిక ఐఎంఏ హాల్లో పళ్ల సెట్ల ఉచిత పంపిణీ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీసీహెచ్ఎస్ డాక్టర్ శేషు కుమార్ మాట్లాడుతూ సిబార్ డెంటల్ కాలేజీ, శ్రీ సత్యసాయి సేవ సమితి సంయుక్తంగా ఈ శిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు. సత్యసాయిబాబా వారి శత జయంతి వేడుకలు, సిబార్ డెంటల్ కాలేజీ రజితోత్సవ సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేశామని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ చెప్పారు. సిబార్ వైస్ డీన్, డాక్టర్ మన్నే కిషోర్ మాట్లాడుతూ.. 35 మందికి తీసి పెట్టుకునే పూర్తి పళ్ల సెట్స్ అందజేశామన్నారు. కార్యక్రమాన్ని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సెంట్రల్ సభ్యుడు రావి శ్రీనివాసరావు పర్యవేక్షించగా, ఐఎంఏ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు కె.శివప్రసాద్, సత్యసాయి సేవ సంస్థ జిల్లా వైద్య సమన్వయకర్త సాయిప్రసాద్, అజిత, ఉషా కాంతి, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన యోగా సభ

చిలకలపూడి(మచిలీపట్నం): ఉత్తమ ఐఏఎస్ అధికారిగా అవార్డు సాధించిన కలెక్టర్ డీకే బాలాజీని ఏపీ యోగా సభ సభ్యులు గురువారం ఉదయం ఘనంగా సత్కరించారు. ఇటీవల ముస్సోరిలో ఐఏఎస్ అధికారుల మిడ్ క్యారియర్ శిక్షణకు వెళ్లి నాలుగు వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకుని ఉత్తమ ఐఏఎస్ అధికారిగా అవార్డు పొంది జిల్లాకు విచ్చేసిన ఆయన గురువారం ఉదయపు నడక మిత్ర మండలి భవనంలో యోగా శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాల్లో అన్ని విభాగాల్లో ఓవరాల్‌గా విజయం సాధించిన కలెక్టర్ బాలాజీకి ఉత్తమ ఐఏఎస్ అధికారిగా అవార్డు లభించింది. యోగా గురువులు ఘంటసాల గురునాథ్‌బాబు, మహాలక్ష్మి తదితర సభ్యులు సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిరంతర యోగా సాధన వల్ల ఈ అవార్డు సాధించగలిగానన్నారు. తాను ముస్సోరీలో గతంలో పాల్గొన్న శిక్షణ కంటే ఈ శిక్షణ తనకు ఎంతో ఉపయోగంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో యోగా గురువులు మద్దాలి చింతయ్య, శీలం రమేష్, వడ్డి శ్రీనివాసు, డీఐపీఆర్వో ఎం.వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీ ని సన్మానిస్తున్న యోగా సభ సభ్యులు

అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరుపై హర్షం

అవనిగడ్డ: అధికార భాషా సంఘానికి మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు పేరు పెడుతూ మంత్రి వర్గం ఆమోదం తెలపడంపై ఆయన తనయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంతోషం వ్యక్తం చేశారు. అవనిగడ్డలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. విజయవాడలో జరిగిన మండలి వెంకట కృష్ణారావు శతజయంతోత్సవాల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రకటించిన విధంగానే అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. 1973లో మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి ఎందరో ప్రముఖులు ఈ సంఘానికి అధ్యక్షులుగా చేసి తెలుగు భాషాభివృద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. అంతటి గొప్ప సంఘానికి తన తండ్రి పేరు పెట్టడంతో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక వంతెన సెంటర్‌లోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి ఆయన అభిమానులు పూలమాలవేసి నివాళులర్పించి, సంతోషం వ్యక్తం చేశారు.



అవనిగడ్డలో నివాళులర్పిస్తున్న అభిమానులు

ఆనందోత్సాహాలతో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు

మచిలీపట్నంటౌన్: ఆర్యవైశ్య మహిళా విభాగం బందరు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మచిలీపట్నం, పెడన, పామర్రు తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా... కేరింతలు కొడుతూ సందడి చేశారు. అందరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మహిళలకు పలు రకాల ఆటలు పోటీలు నిర్వహించి విజేతలకు చీరలు, వెండి వస్తువులు, కుర్చీలు, వంట సామగ్రి, హాలో లైట్ నూనె తదితరాలను బహుమతులుగా అందజేశారు. పలు సినీ గీతాలకు లయబద్ధంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య మహిళా విభాగ్ మచిలీపట్నం మండల అధ్యక్షురాలు తుమ్మలపల్లి విశాలాక్షి, కార్యదర్శి సామా అపర్ణ, కోశాధికారి మాటూరి శ్రీలక్ష్మి పర్యవేక్షించారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కార్మికుల వేతనాలు, మెనూ చార్జీలు సకాలంలో చెల్లించాలి

చల్లపల్లి: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు, మెనూ చార్జీలు సకాలంలో చెల్లించాలని శ్రామిక మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ధనశ్రీ కోరారు. స్థానిక గుంటూరు బాపనయ్య భవనంలో గురువారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ్య కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. సభ్యులు మద్దాల నాగరాణి, పి.హేమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధనశ్రీ మాట్లాడుతూ ఒంటరి మహిళలకు, వితంతువులకు మహిళా సాధికారత కల్పిస్తామని జపం చేస్తున్న కేంద్రం గత 11 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచకపోవటం బాధాకరమన్నారు. 45వ కార్మిక సదస్సు నిర్ణయం ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.26 వేలు కనీస వేతనం, ఒక్కొక్క విద్యార్థికీ మెనూ చార్జీ కింద రూ.20లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 300 మందికిపైగా పిల్లలు ఉన్న జెడ్పీ హైస్కూల్స్‌లో ముగ్గురు ఆయాలను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న పి.ధన్యశ్రీ

నూతన సభ్యుల ఎన్నిక..

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శిలుగా మద్దాల నాగరాణి, గుర్విందపల్లి కమల, ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శిలుగా ఎం.నాగమణి, పి.హేమలతలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు, సీఐటీయూ మండల కన్వీనర్ మహ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



మచిలీపట్నంఅర్బన్: ఆడపిల్లలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మచిలీపట్నం కమ్యూనికేషన్ ప్రైవేట్ లిమిటెడ్(ఎంపీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ కొల్లు జ్ఞాన సాయి తెలిపారు. స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు ఎంసీపీఎల్ తరఫున రూ.50 వేల విలువ చేసే గుర్తింపు కార్డులను గురువారం అందజేశారు. కళాశాల మేనేజ్‌మెంట్ కమిటీ కార్యదర్శి కొల్లు శ్రీనివాసరావు గత దశాబ్దంగా అనేక బహుమతులు అందజేస్తున్నారన్నారు. ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణ కోసం పలు చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ పీఎస్‌జీఎన్ లక్ష్మి మాట్లాడుతూ కళాశాలలో తొమ్మిది కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎల్.హరనాథ్ బాబు, అధ్యాపకులు విజయశ్రీ, సుందర్ లక్ష్మి, కిరణ్మయి, సాజిదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

రైతులను వదలని ముంపు కష్టాలు

చల్లపల్లి: వరద ముంపు నుంచి ఇప్పుడిప్పుడే పంటలు బయటపడి కోలుకుంటున్నాయి అనుకుంటున్న సమయంలో మరలా కృష్ణానదికి భారీగా వరద నీరు రావటంతో కరకట్ట దిగువన ఉన్న వాణిజ్య పంటలు రెండో సారి ముంపునకు గురయ్యాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి ఐదు లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి వదలటంతో కృష్ణా నదిలో నీటి మట్టం పెరిగింది. వరద నీరు కరకట్ట దిగువన ఉన్న పంటలను ముంచెత్తింది. కొన్ని రోజుల క్రితం నదికి వరద వచ్చి తగ్గింది. అప్పట్లోనే పసుపు, కంద, బొప్పాయి, అరటి, కూరగాయల పంటలు ముంపునకు గురయ్యాయి. చాలా రోజులు పంట పొలాలు నీటిలోనే నానాయి. అప్పటికే పసుపు, కంద, కూరగాయ పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయి.



చల్లపల్లి మండలంలో నీట మునిగిన కూరగాయల పంటలు

ప్రభుత్వం ఆదుకోవాలి..

క్రమంగా వరద తగ్గిపోవటంతో మునిగిన పంటలు మెల్లగా బయటపడి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. దీంతో రైతులు కొంత వరకైనా పంట నిలబడుతుందని ఊరట చెందారు. ఇంతలోనే నదిలో రెండో సారి వరద వచ్చింది. గతంలో మునిగిన పంటలే మరలా ఇప్పుడు కూడా ముంపునకు గురవటంతో ఈసారి పంటపై పూర్తిగా ఆశలు వదులుకున్నామని రైతులు తమ నిస్సాహాయతను వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 28వ తేదీ వరకూ నదిలో వరద కొనసాగుతుందని వార్తలు రావటంతో పూర్తిగా చేతులెత్తేశామని చెప్పుకొస్తున్నారు. తాము ఆరుగాలం చేసిన కష్టమంతా కళ్లేదుటే వరదలో కలిసిపోతుంటే తట్టుకోలేకపోతున్నామని వరద వల్ల తాము పూర్తిగా నష్టపోయామని ప్రభుత్వమే ఆదుకోవాలని వారు వేడుకొంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కృత్తివెన్ను: కృత్తివెన్ను, లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ గోవిందరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాన్స్‌కో 132/33 మచిలీపట్నం నుంచి సరఫరా అయ్యే 33 కేవీ కృత్తివెన్ను ఫీడర్ మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నామని కృత్తివెన్ను ఏఈఈ లక్ష్మీరాజేష్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైద్య కళాశాలలో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంఅర్బన్: శ్రీ పింగళి వెంకయ్య(ఎస్పీవీ) వైద్య కళాశాలలో 2025–26 గాను పారా మెడికల్(అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్) కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమా కోర్సులకు ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీలలో ఉతీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. మొత్తం 50 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులు డబ్ల్యూడబ్ల్యూ.ఏపీపీఎంబీ.సీఓ.ఇన్//ఏపీఎస్‌ఏహెచ్‌పీసీ.సీఓ.ఇన్ లో ఉన్నాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను వైద్య కళాశాల కార్యాలయంలో సెప్టెంబర్ 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు రూ.100 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. 20 సీట్లు డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, 10 డిప్లొమా ఇన్ ఆప్తోలోమాలజీ అసిస్టెంట్, 10 డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, 5 డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్ మెంట్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, 5 సీట్లు డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీలలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు



గూడూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని గూడూరు ఎస్‌ఐ కేఎస్‌వీ సత్యనారాయణ హెచ్చరించారు. గూడూరు సెంటరులో ట్రాఫిక్ నిబంధనలపై గురువారం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడంతో జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. వాహనానికి చెందిన అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ షేక్ బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



మచిలీపట్నంటౌన్: ఆర్థిక అక్షరాస్యత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ జ్యోతి ప్రసాద్ అన్నారు. స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల కళాశాలలో గురువారం జరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్‌కు జ్యోతి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక భద్రతా పథకాలను వినియోగించుకోవాలని కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ నవక్రాంత్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆర్థిక క్రమశిక్షణను చిన్నతనం నుంచి అలవర్చుకోవాలన్నారు. వర్క్ షాప్‌ను సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. తొలుత బ్యాంక్‌ల సేవల వివరాలతో కూడిన బ్రోచర్‌ను బ్యాంకుల అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.